

నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో పని చేస్తున్న పాఠశాలలకు సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడు తెలిపారు. అక్టోబరు 3న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని చెప్పారు. సెలవు రోజుల్లో పాఠశాలలు ఎవరు తెరిచినా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కచ్చితంగా ఆదేశించారు.

సర్వం సిద్ధం

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు
- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు



విజయనగరం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా శోభ సంతరించుకుంది. సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలను ముస్తాబు చేసి అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల కాంతులతో ఆలయాలు ధగధగ మెరిసిపోతున్నాయి. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల్లోపు దుర్గాదేవికి కలశస్థాపన చేసి, పూజలు నిర్వహించేందుకు పురోహితులు నిర్ణయించారు. మండపాల్లో కొలువు దీర్చేందుకు దుర్గాదేవి విగ్రహాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. రోజుకో అవతారంలో దుర్గాదేవి దర్శనమివ్వనున్నారు. చివరి మూడు రోజులు దుర్గాష్టమి, మహార్ణవమి, దశమి రోజున దుర్గాదేవికి విశేషపూజలు నిర్వహించనున్నారు.

పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో..

పాలకొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల కోర్కెలు తీర్చే పాలకొండ కోట దుర్గమ్మ శరనన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు అమ్మవారు నిజరూపంలో దర్శనమివ్వనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు, టెంట్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- రూ.10 లక్షలతో మహాకవి స్వగృహం అభివృద్ధి: ఎంపీ కలిశెట్టి



గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొండపల్లి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తదితరులు



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరంలో గురజాడ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురజాడ నివాసంతో పాటు అదే రోడ్డులో ఉన్న గురజాడ విగ్రహానికి మంత్రి కొండపల్లితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత గురజాడ నివాసం నుంచి సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గురజాడ భావాలు, రచనలు నిత్య నూతనమని అన్నారు. 150 ఏళ్ల కిందటే ముందు చూపుతో గొప్ప రచనలు చేశారని కొనియాడారు. ప్రధాని నరేంద్రమోదీ సైతం గురజాడ రచనలు నుంచి స్ఫూర్తి పొందినట్లు చెప్పారని గుర్తు చేశారు. గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన జీవిత చరిత్ర, దేశభక్తి గీతాలను పాఠ్యాంశాల్లో చేర్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఆయన చిత్రపటాన్ని ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గురజాడ స్వగృహం పక్కన ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ.. ఎన్ని తరాలు మారినా, గురజాడ రచనలు సజీవంగా నిలిచే ఉంటాయన్నారు. ఆయన దేశభక్తి గేయం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. గురజాడ స్వగృహం అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. కలెక్టర్ రామ సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. గురజాడ గొప్ప సంఘ సంస్కర్తని, తెలుగు భాష ఉన్నంత వరకూ ఆయన రచనలు నిలిచి ఉంటాయన్నారు. కన్యాశుల్కంలో సృష్టించిన గిరీశం, మధురవాణి, రామప్పపంతులు వంటి పాత్రలు నేటికీ మన కళ్లముందే కదలాడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి, డీఈవో మాణిక్యం నాయుడు, మునిసిపల్ కమిషనర్ నల్లనయ్య, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, డీపీఆర్వో గోవిందరాజులు, జిల్లా పర్యాటక శాఖాధికారి కుమారస్వామి, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మండపాక నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పండుగ కానుక!



- నేటి నుంచి తగ్గనున్న జీఎస్టీ శ్లాబులు
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- వస్తువుల కొనుగోలుదారులకు ఊరట

విజయనగరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ శ్లాబులు ఆదివారం అర్థరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. దీంతో పలు వస్తు, సేవల ధరలు భారీగా తగ్గాయి. సోమవారం నుంచి తగ్గింపు ధరలు అందుబాటులోకి వస్తాయి. అది కంగా గృహోపకరణాలు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి చాలా ఉత్పత్తులపై 10శాతం మేర ధరలు తగ్గనున్నాయి. దీంతో వాహనాలు, కార్లు, టీవీలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువుల కొనుగోలుదారులకు ఊరట లభించనుంది. గృహ నిర్మాణదారులకు కూడా ఉపశమనం దక్కనుంది. జీఎస్టీలో మార్పుల కారణంగా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరనుంది.





తగ్గనున్న ధరలు ఇవీ..

● తలనూనె, షాంపు, టూత్‌పేస్ట్, సబ్బులు, షేవింగ్ క్రీమ్స్, వెన్న, చీజ్, నెయ్యి, డెయిరీ స్ప్రెడ్స్, ఓటెన్ సెల్స్, ఫీడింగ్ బాటిల్స్, ప్యాకింగ్ నాప్కిన్స్ ఫర్, బేబీస్ క్లినికల్ డైపర్స్, టైలరింగ్ మిషన్స్, విడిభాగాలు 5శాతం జీఎస్టీకి శ్లాబ్‌లోకి తీసుకొచ్చారు.

● వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్లు, టైర్లు, విడిభాగాలు, బయో పెస్టిసైడ్స్, మైక్రో న్యూట్రి యంట్స్, డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, స్పింక్లర్స్, హార్టికల్చర్ ఫారెస్ట్ మోషిన్స్,



కల్టివేషన్ యంత్రాలు, హార్వెస్టింగ్ యంత్రాలు సైతం 12 శాతం నుంచి 5 శాతం శ్లాబ్‌లోకి తెచ్చారు.

● ఎలక్ట్రికల్ వస్తువులైన ఏసీ, టీవీ, వాషింగ్ మిషన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మానిటర్లు, సెల్‌ఫోన్లు, ప్రొజెక్టర్లు తదితర వాటిని 28 శాతం నుంచి 18 శాతం పన్ను పరిధిలోకి తెచ్చారు. దీంతో వాటిపై రూ.3,600 నుంచి 7వేల వరకు ధరలు తగ్గనున్నాయి. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ఇప్పటికే వ్యాపారులు ఆయా వస్తువులపై డిస్కౌంట్లు ప్రకటించారు.

● లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్‌లతోపాటు థర్మామీటర్, మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్ , డయాగ్నొస్టిక్స్ ఐటమ్స్, గ్లూకోమీటర్ టెస్ట్ స్ట్రిప్స్, కరెక్టివ్ స్పెటికల్స్‌ను 18, 12 శాతాల శ్లాబ్‌ల నుంచి జీరో, 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చారు. దీంతో రోగులపై ఆర్థిక భారం తగ్గనుంది.

● విద్యా సంబంధిత మ్యాప్స్, చార్ట్స్, గ్లోబ్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, నోట్‌బుక్, రబ్బరు (మిగతా 8వ పేజీలో..)

గంగాధర్‌కు కీర్తిచక్ర పురస్కారం

- బొబ్బిలి వీణల తయారీ కళాకారునికి అరుదైన గౌరవం
- హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం

బొబ్బిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లికి చెందిన వీణల తయారీ కళాకారుడు సర్వసిద్ధి గంగాధర్ ఆచారికి అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీఆర్యాణి సకల కళావేదిక గంగాధర్‌కు జాతీయస్థాయి కీర్తిచక్ర పురస్కారం, స్వర్ణకంకణంతో సత్కరించింది. సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ అవార్డును ప్రదానం చేసింది. గంగాధర్ 40 ఏళ్లుగా వీణల తయారీ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. తన తండ్రి వీరన్న వీణల తయారీలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారని, ఆయన ఆశీస్సులు, వారసత్వంగా ఈ కళలో నైపుణ్యం తనకు దక్కిందని గంగాధర్ అంటున్నారు. తన కళానైపుణ్యానికి తెలంగాణలో పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) తన సొంత ఖర్చులతో బొబ్బిలి సంగీత వీణను తయారుచేయించి అయోధ్య రామమందిరానికి బహూకరించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ వీణను గంగాధర్ తయారు చేస్తున్నారు. ఇది తుది దశకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. పురస్కారం అందుకున్న గంగాధర్‌ను ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి. శరత్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



పురస్కారం అందుకున్న వీణల తయారీ కళాకారుడు గంగాధర్ ఆచారి

అసౌకర్యం కలగకుండా
సిరిమాను తరలింపు
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 8లో

వైసీపీ నాయకులు
తిరుమలపై మాట్లాడడం విడ్డూరం
● ఎంపీ కలిశెట్టి 7లో

తమటాడలో అగ్నిప్రమాదం
● రూ.4 లక్షల ఆస్తి నష్టం 7లో

ఉచిత బస్సు రయ్ రయ్
● నెల రోజుల్లో ప్రయాణించిన మహిళలు 17.91 లక్షలు 8లో



పిల్లలపై ఓ కన్నేయండి

- నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు
- కాలక్షేపం మాటున అపాయాలు
- ఊహించని ప్రమాదాలతో మూల్యం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే



రాజాం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెలవులు అనగానే పిల్లలకు ఎక్కడ పట్టలేని ఆనందం వస్తుంది. ఆ సమయంలో కాలక్షేపం కోసం వారుచేసే పనులు ఊహించని ప్రమాదాలకు దారితీస్తుంటాయి. ఒక్కోసారి కన్నవారికి కడుపుకోతను మిగులుస్తాయి. పాఠశాలలో అయితే నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉంటారు. పైగా తరగతులు, సిలబస్ వంటి వాటితో క్షణం తీరిక లేకుండా ఉంటారు. వేసవి, దసరా, సంక్రాంతి సెలవులు అనేసరికి అధిక సమయం ఖాళీగా దొరుకుతుంది. అప్పుడే పిల్లలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చోటు చేసుకున్న పరిణామాలు పిల్లల సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని చాటిచెబుతోంది. సోమవారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

● ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో నదులు, కాలువలు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. సాధారణంగా నీరు కనిపిస్తే పిల్లలకు ఈత కొట్టాలనిపిస్తోంది. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఎక్కువగా ఈత వస్తుంది. చిన్నప్పటి నుంచి పట్టణాలు, హాస్టళ్లలో ఉండే పిల్లలకు ఈత పెద్దగా తెలియదు. అటువంటి వారు గ్రామాలకు వచ్చి తోటి పిల్లలతో సరదాగా ఈతకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఈతరాక ప్రమాదాలకు గురవుతుంటారు. అటువంటి వారి విషయంలో తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. సెలవులకు గ్రామాలకు వచ్చే పిల్లలకు ప్రమాదకరమైన చెరువులు, కాలువలు, కుంటల గురించి చెప్పాలి. అటువైపుగా వెళ్లినప్పుడు పెద్దవారి తోడు తీసుకొని వెళ్లాలని చెప్పాలి.

● కొందరు పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో ఉన్న వాహనాలను తీసుకొని రోడ్లపైకి వచ్చేస్తుంటారు. మితిమీరిన వేగానికి తోడు రహదారి భద్రత పాటించడం లేదు. అర్థరాత్రి లాంగ్ డ్రైవింగ్ అంటూ చేసే ప్రయాణాలు చేటు తెస్తున్నాయి. అతి వేగం కారణంగా జరుగుతున్న ప్రమాదాలు బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. ఒక్కోసారి వీరి కారణంగా ఎదుటి కుటుంబాలు సైతం వీధినపడుతున్నాయి. అందుకే పిల్లల చేతికి వాహనాలు ఇవ్వకపోవడమే శ్రేయస్కరం.

● ఆన్‌లైన్ తరగతులు, అదనపు పరిజ్ఞానం కోసమంటూ చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల చేతిలో సెల్‌ఫోన్లు పెడుతుంటారు. దాంతో ఎంతో ప్రయోజనమో చెప్పలేం కానీ అనర్థాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఫొటోల యాప్స్ మొదలు ఆన్‌లైన్ గేమ్స్ వరకూ అన్ని యాప్‌ల గురించి పిల్లలు తెలుసుకుంటున్నారు. సోషల్‌మీడియాలో అకౌంట్లు తెరుస్తున్నారు. వారు నేర్చుకునే విషయాలు ఎటువైపునకు దారితీస్తాయో అనేది తల్లిదండ్రులు గ్రహించాలి. అందుకే పిల్లలకు ఈ సెలవుల్లో అవసరం మేరకు మాత్రమే సెల్‌ఫోన్లు ఇవ్వాలి.



● జిల్లాలో మైనర్లు, విద్యార్థులు మత్తు బారినపడుతుండడం (మిగతా 8వ పేజీలో..)

పారిశ్రామిక వెలుగులు

- జిల్లాలో ఊపందుకున్న ఎంఎస్ఎంఈ పార్కుల పనులు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకొస్తున్న ఔత్సాహికులు



నెల్లిమర్ల పారిశ్రామికవాడలో చురుగ్గా జరుగుతున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మసకబారిన జిల్లా పారిశ్రామిక రంగం ప్రస్తుత ప్రభుత్వంలో వెలుగులు విరాజిల్లుతోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) సంబంధించి శంకుస్థాపన చేసిన నాటి నుంచే పనులు పరుగులు పెడుతున్నాయి. పారిశ్రామిక ప్రగతికి అవసరమైన వనరులను గుర్తించడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా నెల్లిమర్ల పారిశ్రామికవాడలోని మూడు ఎకరాల్లో రూ.7.73 కోట్లతో చేపడుతున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ) పనులు చురుగ్గా జరుతున్నాయి. ఈ భవనంలో 29 గదులు నిర్మించి ఔత్సాహికులకు అద్దెకు ఇవ్వనున్నారు. ఎస్.కోట నియోజకవర్గం కొత్తవలస మండలం బలిఘట్టంలో 57.09 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించారు. తొలిదశలో 25 ఎకరాల్లో రూ.3.51 కోట్లతో పనులకు ఆదేశాలిచ్చారు. ఇందులో రహదారులు, కాలువలు, విద్యుత్ సరఫరా పనులు చేపట్టనున్నారు. బొండపల్లి మండలం కొండకిండాంలో ఎంఎస్ఎంఈ పార్కుకు 57.49 ఎకరాలు గుర్తించారు. తొలి దశలో 25 ఎకరాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.4.92 కోట్లతో పనులు ప్రారంభించారు. చీపురుపల్లి నియోజకవర్గం కుమరాం గ్రామ సర్వేనెంబరు 144లో ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించిన పదెకరాలు అనువుగా లేదని, ప్రత్యామ్నాయ స్థలం చూడాలని కలెక్టర్‌కు రాష్ట్ర అధికారులు సూచించారు. విజయనగరం మండలం కొండకరకంలో సర్వే నెంబరు 198, 57, 58లో గుర్తించిన 12 ఎకరాలకు బదులు మరోచోట స్థలమివ్వాలని కలెక్టర్‌ను ఉన్నతాధికారులు కోరారు. అలాగే రాజాం నియోజకవర్గం సంకిలి వద్ద సర్వే నెంబరు 319లో గుర్తించిన 20 ఎకరాల్లో కొన్ని డీకేటీ భూములు ఉన్నందున, ఎంఎస్ఎంఈ పార్కు కోసం ప్రత్యామ్నాయ స్థలం చూడాలని కలెక్టర్‌ను ఉన్నతాధికారులు కోరారు. రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామం వద్ద వంద ఎకరాలను గుర్తించారు. ఇక్కడ మూడు దశల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధికి నిర్ణయించారు. తొలి దశలో 25 ఎకరాల్లో చేపట్టనున్నారు. రూ.3.44 కోట్ల వ్యయంతో పనులు పూర్తికి కాంట్రాక్టరు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో పనులు ఊపందుకున్నాయి.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



న్యాయమూర్తికి మొక్కను అందిస్తున్న కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు జస్టిస్ సి.హెచ్.మానవేంద్రనాథ్ రాయ్‌ను ఆదివారం పార్వతీపురంలోని ఆయన స్వగృహంలో కలెక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



రామభద్రపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) రొంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్ల భవనాల నిరుపయోగంగా ఉన్నాయి. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాల మధ్య ఉన్న పాత మరుగుదొడ్లనే విద్యార్థులు వినియోగిస్తున్నారు. పనులు పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ వాటిని అప్పగించలేదు. అలాగే 2023-24లో ఈ పాఠశాలకు నాడు-నేడు కింద 2 అదనపు పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు మంజూరు చేశారు. అదనపు భవనాలు ఇప్పటికీ పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. మరుగుదొడ్లకు మాత్రం తాళాలు వేశారు. దాదాపు మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్న పట్టించుకునే నాథులే కరువయ్యారు. దీనిపై అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవడంతో పాటు అదనపు భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మూలకు చేరిన చెత్తసేకరణ వాహనం



నిరుపయోగంగా ఉన్న వాహనం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పిరిడి పంచాయతీకి చెందిన చెత్త సేకరణ ఆటో మూలకు చేరింది. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో మువ్వలవీధిలో వర్షంలో తడుస్తూ ఎండలో ఎండుతూ తుప్పు పట్టి పాడవుతోంది. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనం పాడవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ● ఈ విషయంపై ఎంపీడీవో రవికుమార్ వివరణ కోరగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కల్వర్టు కూలిన ప్రాంతమిదే..



విరిగిన రక్షణ గోడ

గరుగుబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలోని ఎడమ ప్రధాన కాలువపై నిర్మాణం చేపట్టిన ప్రధాన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటీష్ హయాంలో 1908లో నిర్మించిన కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పాడయ్యాయి. ఈ కల్వర్టు మీదుగా కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలతో పాటు ఒడిశా ప్రాంతీయులు రాకపోకలు సాగిస్తుంటారు. వందేళ్ల పైబడి నిర్మించిన కల్వర్టుకు నేటికీ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. కాలువపై భాగంలోని రక్షణ గోడలు శిథిలరూపు దాల్చాయి. కల్వర్టుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, మరోవైపు ప్రధాన కాలువ ఉంది. ఏ మాత్రం అదుపు తప్పినా ఎడమ కాలువలోకి దూసుకుపోయే పరిస్థితి ఉంది. గతంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఘటనలు ఉన్నాయి. రక్షణ గోడలను వాహనాలు ఢీకొట్టడంతో జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. కల్వర్టు మార్గం చిన్నపాటిది కావడంతో నిత్యం రక్షణ గోడలు కూలుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. కల్వర్టుకు ప్రమాదం వాటిల్లితే రాకపోకలు నిలిచే పరిస్థితి ఉంది. సమస్యను పలు దఫాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ పరిష్కారం చూపడంలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రధాన కల్వర్టు రక్షణ గోడలతో పాటు పిచ్చి మొక్కలు తొలగింపు, బీటీ రహదారి మరమ్మతులకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేదెప్పుడో?

వీరఘట్టం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో యు.వెంకంపేట, సంత నర్సిపురం గ్రామాల్లో నిర్మించిన రెండు బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్కొక్కటి సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణాలు పూర్తిచేశారు. అయినప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకు రాలేదు. యు.వెంకన్నపేట వద్ద నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాముకు వెళ్లేందుకు ప్రధాన రహదారి నుంచి గోదాము వరకు సరైన రోడ్డు లేదు. దీనితో లారీలు అక్కడికి వెళ్లడానికి అనుకూలంగా లేని కారణంగా వ్యాపారులు ఎవరూ అద్దెకు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. అలాగే మండలానికి శివారున సంతనర్సిపురంలో ఉన్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాము కూడా వినియోగంలోకి రాలేదు. దీనితో ఈ రెండు నిర్మాణం పూర్తయినప్పటికీ నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు గోదాములకు సరైన రహదారులు నిర్మించి వినియోగంలోకి వచ్చేల చూడాలని పలువురు కోరుతున్నారు. ●ఈ విషయమై వీరఘట్టం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఇన్‌చార్జి సీఈవో బలరాం వద్ద ప్రస్తావించగా రెండు గోదాములను సరుకు నిల్వ చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని ఎవరైనా వ్యాపారులు ముందుకు వస్తే అద్దెకు ఇస్తామన్నారు.



యు.వెంకంపేట వద్ద నిర్మించిన గోదాము

దేవీ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి







బొబ్బిలి: కొలువుదీరేందుకు సిద్ధమైన దుర్గమ్మ / సాలూరు రూరల్: ముస్తాబవుతున్న అమ్మవారి విగ్రహాలు / వీరఘట్టం: విద్యుత్ కాంతులతో కోటదుర్గమ్మ ఆలయం

సాలూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు సాలూరులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాలూరు పంచముఖేశ్వరస్వామి ఆలయంలో సుబ్బగురువు పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించనున్నారు. అమ్మవారు 22న బాలా త్రిపురసుందరి, 23న పార్వతీదేవి, 24న భువనేశ్వరి, 25న నారాయణి, 26న పారమ్మతల్లి, 27న గాయత్రి, 28న కాత్యాయణి, 29న సరస్వతి, 30న దుర్గ, వచ్చేనెల 1న మహాలక్ష్మి అవతారాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నట్టు సనాతన ధర్మపరిషత్ అధ్యక్షుడు కోలకోటి శంకరరావు చెప్పారు. అలాగే శ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరి,సంతోషిమాత తదితర ఆలయాల్లో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. పాచిపెంట మండలం పణుకువలసలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి దూపం శంకరరావు ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రులను నిర్వహించనున్నారు.

●వీరఘట్టం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రముఖ యజ్ఞకర్త సర్వాజోస్యుల శర్మయాజీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆలయం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

●బొబ్బిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుర్గాదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాట పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని దాడితల్లి, సంతోషిమాత, బంగారమ్మ, దేశతల్లి, లలితాంబ ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆయా ఆలయాలన్నింటా చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. బంగారమ్మ ఆలయంలో ఏటా మాదిరిగానే వేకువజామున 3 గంటల నుంచే అమ్మవారి కుంకుమ పూజలు, దీక్షలు చేపట్టనున్నారు. ఆలయ అర్చకులు ప్రకాశ్ పండా, విజ్జు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దత్తాత్రేయ ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారి పూజల కోసం సన్నాహాలు చేశారు. షిర్డీసాయి మందిరంలో దసరా ఉత్సవాలను షిర్డీలో మాదిరిగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది.

పార్వతీపురంలో భారీ వర్షం



పట్టణంలో వర్షం కురుస్తున్న దృశ్యం

పార్వతీపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం తో పాటు పార్వతీపురం మండలం తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పిడుగుల శబ్దాలకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. భారీ వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో జిల్లా కేంద్రంలోని రహదారులపై మురుగునీరు రహదారులపై పొంగి ప్రవహించింది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు.

●గరుగుబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఊరట లభించింది. ఉదయం వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండటంతో ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఎండ నుంచి వారికి ఉపశమనం కలిగింది. వరి పంటకు జీవం పోసినట్లయింది.

కోతకు గురైన రహదారి



రహదారి ఇలా..

మక్కువ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సువర్ణముఖి నది వంతెన, పెట్రోల్ బంకు సమీపంలో రహదారి కోతకు గురైంది. ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రిపూట వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రూపు కోల్పోయింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



భామిని: అమ్మవారికి మహిళల పూజలు

బొబ్బిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం పోలేరు అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. పితృ దేవతలకు తర్పణాలు, పిండప్రదానం వంటివి గావించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తమ కుటుంబాలను చల్లగా కాపాడాలని అమ్మవారిని కోరారు. బ్రాహ్మణులకు స్వయంపాకం సమర్పించి వారి ఆశీస్సులు పొందారు.

●భామిని, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలాల అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం మహిళలు పోలేరు అమ్మవారికి సామూహికంగా పూజలు చేశారు. ఈ అమావాస్య సందర్భంగా పూజలు చేయడం వల్ల తమ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారనేది వారి నమ్మకం. ఈ సందర్భంగా అమ్మవారికి పిండివంటలు నైవేద్యం సమర్పించారు. అలాగే బత్తిలిలో సాయి మందిరంలో సామూహిక పూజలు మహిళలు చేపట్టారు.

13 గంటల పని చట్టం రద్దు చేయండి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పని విధానం బిల్లు ఆమోదానికి నిరసనగా ఆదివారం ఎం.బూర్జవలసలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు, ఎస్.గోపాలం మాట్లాడుతూ కర్మాగారాలు, షాపులు, సంస్థల్లో పని గంటల పెంపును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కె.శంకరరావు, జి.అప్పలనాయుడు, గ్రోత్ సెంటర్ కార్మికులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవరచుకోండి

రామభద్రపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరూ దైవభక్తితో పాటు సేవాగుణం అలవరచుకోవాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ దాసరెడ్డి యోగీశ్వర రావు అన్నారు. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ సమాజాభివృద్ధికి యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మాన్ని ప్రతీ ఒక్కరూ పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ సింగిడి నరసింగరావు, కో-కన్వీనర్ బాదంపూడి నాగ రామలింగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ముగ్గురు గిరిజనుల నుంచి రూ.7.50 లక్షల తీసుకుని మోసం చేసిన గంటా కమలాకర్ అతడి భార్య రత్నలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అమ్మనరావు తెలిపారు. కొండాడ పంచాయతీ బెన్నరాయి గ్రామానికి చెందిన గిరిజనులు కె.రమేష్, ఆరిక నాగేశ్వరరావు, బిడ్డిక కామేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కనకదుర్గమ్మ సేవలో ప్రభుత్వ విప్



పూజల్లో ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనకదుర్గమ్మను ఆదివారం ప్రభుత్వ విప్, కురపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సభ్యులతో కలిపి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్టు ఆమె తెలిపారు.

పర్యాటక ప్రదేశాలపై రీల్స్ పోటీ

పార్వతీపురం, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సోయగాలు, సుందరమైన ప్రాంతాలు, జలపాతాలకు మన్యం జిల్లా నెలవని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి అన్నారు. ప్రాధాన్యత సంతరించుకున్న జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్న జలపాతాలు, వ్యూపాయింట్స్ ఇతర సుందర చారిత్రక ప్రదేశాలపై 60 సెకెండ్ల నిడివిగల వీడియోలు తీసి ఈ నెల 30వ తేదీలోగా మన్యం.పబ్లిసిటీ జీమెయిల్.కామ్ వెబ్‌సైట్‌కు పంపాలని ఆమె ఓ ప్రక టనలో కోరారు. జిల్లాలోని పర్యాటక రంగ ప్రాంతాలు, ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు దేవాలయాలతో పాటు జిల్లా చరిత్రపై చిత్రీకరించిన వీడి యోల్లో ఉత్తమమైన వాటికి దసరా ఉత్సవాలు సందర్భంగా బహుమతులను అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతికి రూ.5వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలకు రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు అందిస్తామన్నారు.

●పాలకొండ/ సీతంపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాతో పాటు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పర్యాటక ప్రాంతాలు, ఏజెన్సీ ప్రకృతి అందాలతో పాటు చారిత్రక ప్రదేశాలను 60 సెకన్ల లోపు వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహించనున్నామని ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30లోపు తన వీడియోలను మన్యంపబ్లిసిటీ జీమెయిల్.కాంకు పంపించాలని కోరారు. ఉత్తమ వీడియోలకు నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు.

రెవెన్యూ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పాలకొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలకొండ రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా కలెక్టరేట్ ఏవో జి.శ్రీరామ్మూర్తి, పార్వతీపురం డీటీ ప్రసాదరావు వ్యవహరించారు. పరిశీలకులుగా బలిజిపేట తహసీల్దార్ పి.బాలమురళీకృష్ణ వ్యవహరించారు. ఎన్‌జీవో డివిజన్ గౌరవ అధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం పర్యవేక్షణలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. డివిజనల్ అధ్యక్షుడిగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో ఎం.సావిత్రి, కార్యదర్శిగా పాలకొండ తహసీల్దార్ కార్యాలయం సీఎస్ డీటీ పి.సన్యాసిరావు.. పాలకొండ హెచ్‌డీటీ ఎం.ఎస్.ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా కురపాం హెచ్‌డీటీ సురేష్‌కుమార్, జి.ఎల్.పురం హెచ్‌డీటీ ఎన్.శేఖరం, సీతంపేట ఆర్ఎస్ డీటీ కె.శ్రీవిద్య ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. జీఎం వలస జూనియర్ సహాయకుడు ఆర్.మనోహర్, భామిని ఆర్ఐ పి.మణి ప్రభ, పాలకొండ ఆఫీస్ సబార్డినేట్ మీనాక్షి జాయింట్ సెక్రటరీగా... సీతంపేట వి.గణేష్‌బాబు కోశాధికారిగా, పాలకొండ ఎలక్షన్ జూనియర్ సహాయకురాలు ఎన్.ఆశ కార్యవర్గసభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరఘట్టం తహసీల్దార్ సాయి కామేశ్వరరావు జిల్లా రెవెన్యూ కార్యదర్శిగా నియమించాలని కోరుతూ డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ తరఫున ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

గ్రామాల్లో గీతాపారాయణం

గరుగుబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని గీతాపారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రవచనాలను కంచుమోజు రామ్మోహనరావుతో పాటు బృంద సభ్యులు వినిపించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు గురజాడ జయంత్యుత్సవం

పార్వతీపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు జయంత్యుత్సవాన్ని సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ నూతన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురజాడ జయంతి వేడుకలను జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

చలో విశాఖ డెయిరీ జయప్రదం చేయండి

సీతానగరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని పాడి రైతులు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్ము న్నాయుడు, బి.దాసు అన్నారు. మండలంలోని చిన భోగిలిలో ఏపీ పాల ఉత్పత్తిదారుల సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం చలో విశాఖ డెయిరీ వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్.కృష్ణ, బి.అప్పారావు, సింహాచలం, పాడి రైతులు సత్యం, రమణమ్మ పాల్గొన్నారు.

భోజన కార్మికులను ఆదుకోండి

కొమరాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ఆదుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా ఉపాధ్యక్షుడు టి.తులసమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరకొర వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. సొంత డబ్బులు పెట్టుకుని అప్పులు చేసి పథకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సకాలంలో వంట బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో ఈ నెల 26న మండల కేంద్రంలో తలపెట్టిన మధ్యాహ్న భోజన కార్మికుల సదస్సుకు ప్రతి ఒక్కరు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాకాడ ఇందిర, మండల కార్యదర్శి కొల్లి సాంబమూర్తి, మండల నాయకులు సునీత, కళావతి, అప్పలనరసమ్మ, గంగమ్మ, పార్వతి పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి

రామభద్రపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నానో ఎరువుల వాడకంపై రైతులు దృష్టిసారించాలని తహసీల్దార్ అజురఫీ జాన్ కోరారు. రేంపల్లిలో ఆదివారం యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రసాయన ఎరువల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇప్పటికే దీనిపై మండలంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి చంద్ర, రైతులు పాల్గొన్నారు.

●బాడంగి, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వాడాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం బాడంగిలోని రామలక్ష్మి రైతు డిపోలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో ఎరువుల వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఆయన వివరించారు. పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు.

పైపులైన్ పనులు సకాలంలో పూర్తిచేయాలి

రాజాం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మొగులివలస అంతికాపల్లి పైపులైన్ పనులను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. ఆదివారం ఆయన పైపులైన్ పనులను పరిశీలించారు. తాగునీటి కోసం రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. సకాలంలో పైపులైన్ పనులు పూర్తిచేసి తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

భోగాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణంగా ఉందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించ వలిసి ఉండగా వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పాడ అనూష పాల్గొన్నారు.

నానో ఎరువులతో బహుళ ప్రయోజనాలు

రేగిడి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నానో ఎరువులతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏవో శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సంకిలిలో ఆయన తోపాటు ఏఏ జ్యోత్స్న ఆధ్వర్యంలో నానో ఎరువుపై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియాను వినియోగించాలని కోరారు.

సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

రేగిడి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకంతో విద్యుత్ ఆదా అవుతుందని రేగిడి సబ్‌స్టేషన్ ఏఈ సురేష్ తెలిపారు. ఆదివారం రేగిడిలో సుర్యఘర్ పథకంపై మండల స్థాయి సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, ఎంఈవో వరప్రసాదరావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు



సంఘ ప్రతినిధులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

చీపురుపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన పూజల్లో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లంపల్లి ఆచారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కొండపల్లి అప్పారావు, పట్నాన ఈశ్వరరావు, ఎస్.భాస్కరరావు, ఎల్.కనకరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

శృంగవరపుకోట సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2 విజయదశమి వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. వివిధ రకాల నైవేద్యం సమర్పించనున్నారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన

నెల్లిమర్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త, జనసేన పార్టీ నాయకుడు లోకం ప్రసాద్ ఆదివారం సందర్శించారు. భవనాల నిర్మాణాన్ని పూర్తిచేయడానికి అవసరమైన సమయం, నిధుల వివరాలపై ఇంజనీరింగ్ అధికారులతో ఫోనులో మాట్లాడి, వివరాలను రాబట్టారు. మార్గమధ్యలో గెడ్డవాగుపై నిర్మించాల్సిన కల్వర్టును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రవ్వా నాని, కరుమజ్జి గోవిందరావు, గంటా సతీష్, ఎంఎం నాయుడు, పతివాడ అచ్చంనాయుడు, మాత మురళీమోహన్, కాళ్ల మహేష్, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ పండుగ

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీతారాంపురం గ్రామంలో మరిడమ్మ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, ఎంపీటీసీ సన్యాసప్పడు ఆధ్వర్యంలో గ్రామస్థులు ప్రభను ఊరేగించారు. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రభను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా గురజాడ జయంతి

● మహాకవికి నివాళి

మహాకవి గురజాడ వెంకటఅప్పారావు జయంతి కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల, పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..



విజయనగరం దాసన్నపేట: గురజాడ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ



పార్వతీపురం: నివాళి అర్పిస్తున్న స్నేహకళా సాహితీ ప్రతినిధులు



గరుగుబిల్లి: పరిశినాయుడు నఖంతో గీసిన గురజాడ చిత్రం



బొబ్బిలి రూరల్: ఎమ్మార్సీలో..



సీతంపేట రూరల్: గ్రంథాలయంలో..



బొబ్బిలి: కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



కొమరాడలో సీపీఎం ఆధ్వర్యంలో..

ప్రజారోగ్య రక్షణకు కృషి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన 19 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు, కిమిడి అశోక్‌కుమార్, పి.మోహన్‌రావు, గట్టి భాను తదితరులు పాల్గొన్నారు.

● రేగిడి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సుపర్‌సిక్స్ పథకాలు సుపర్ హిట్ అయ్యాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌రావు అన్నారు. మండలానికి చెందిన 11మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.6.33 లక్షలు మంజూరు కాగా, ఈ చెక్కులను ఆదివారం ఉంగరాడమెట్ట కూడలిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజాం ఏఎంసీ చైర్మన్ గురవాన నారాయణ రావు, తహసీల్దార్ కృష్ణలత, టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, పాలవలస రామ చంద్రినాయుడు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న అన్నపూర్ణ దీదీజీ

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం(బీవీకే) ఇన్‌చార్జి అన్నపూర్ణ దీదీజీ చెప్పారు. నగరంలోని బ్రహ్మకుమారి కేంద్రంలో యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఆదివారం నషా ముఖ్తు యువ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ధ్యాన సాధన ద్వారా ఆధ్యాత్మిక నైతికవిలువలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రాజ్‌కుమార్, జేఎన్‌టీయూ విశ్రాంత ప్రిన్సిపాల్ సరస్వతి, యూత్ ఆఫీసర్ ప్రేమ్‌భరత్‌కుమార్, మహాలక్ష్మి, వలంటీర్లు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు తిరుమలపై మాట్లాడడం విడ్డూరం

● ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమలపై వైసీపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలని దెబ్బతీసిన వైసీపీ నాయకులు ఇప్పుడు తిరుమలపై మాట్లాడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. టీటీడీ పాలకవర్గం, ప్రభుత్వంపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తున్నదని, దీనిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 15 నెలల కాలంలో ప్రభుత్వం అద్భుత పాలన సాగించిందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నామని వైసీపీ రాద్ధాంతం చేస్తున్నదన్నారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను అద్భుతంగా నడిపించాలని చంద్రబాబు ఆలోచన చేస్తున్నారన్నారు. వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లకుండా కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు విజ్జపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో ఎవరైతే పార్టీ కోసం కష్టించి పనిచేశారో అటువంటి కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. రాష్ట్ర దాసరి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా పీవీ రత్నాజీని, కొత్తవలస పీఏపీఎస్ చైర్మన్‌గా కోళ్ల వెంకటరమణను ప్రభుత్వం నియమించిన సందర్భంగా ఆదివారం తుమ్మికాపల్లి గ్రామంలోని కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భగా ఆమె మాట్లాడుతూ కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ, వసంత విహార్ అధినేత వల్లూరి జయప్రకాష్‌బాబు, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు మాకెన సీతారామపాత్రుడు, టీడీపీ ఎంటీసీ చైర్మన్ పూసర్ల రవి తదితరులు హాజరయ్యారు.

ఆకలేస్తుంది.. వదిలేయండి సార్

విజయనగరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక గురజాడ గృహం నుంచి ఆయన విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఉదయం 6 గంటలకే అధికారులు విద్యార్థులను తీసుకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సుమారు 11 గంటల వరకు ఆ చిన్నారులను సభా ప్రాంగణం వద్దే ఉంచారు. కేవలం బిస్కెట్లు, తాగునీరు ఇచ్చి సుమారు 5 గంటల పాటు వారిని అక్కడే ఉంచేశారు. దీంతో ఆకలిని తట్టుకోలేని చిన్నారులు ఇంటికి వెళ్లామని ప్రయత్నించారు. ఇది గమనించిన పోలీసులు, అధికారులు, ఉపాధ్యాయులు వారిని వెళ్లనీయకుండా తిరిగి టెంట్‌లోకి పంపించేశారు. ఆకలి వేస్తుంది.. కళ్లు తిరుగుతున్నాయని ఆ చిన్నారులు వేడుకున్నారు. జనాలు లేకపోతే అధికారుల వద్ద వారికి మాట వస్తుందని, చిన్నారులను పంపించ లేదు. దీంతో చిన్నారులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ఇదిలాఉండగా గురజాడ గృహానికి అలంకారం కూడా చెయ్యలేదు. కేవలం ఎల్ఈడీ దీపాలు కట్టి వదిలేశారు.



బయటకు వెళ్తున్న విద్యార్థినులను అడ్డుకుంటున్న అధికారులు



జీవోలు రద్దు చేయాలని నిరసన చేస్తున్న నిర్వాసితులు

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఉన్న చట్టాలు జిందాల్ నిర్వాసితులకు వర్తించవా.. అంటూ ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ప్రశ్నించారు. బొడ్డవర గ్రామంలో 93వ రోజు ఆదివారం జిందాల్ నిర్వాసితులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌కు తమ వినతులను అందజేయగా, తహసీల్దార్ వాటిని వేరే విధంగా మార్చి ప్రభుత్వానికి నివేదిక పంపించడం ఏంటని జగన్ ప్రశ్నించారు. జిందాల్‌కు అనుకూలంగా ఇచ్చిన జీవోలు వెంటనే రద్దు చేయాలని కోరారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

భోగాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూష అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రసాభాసగా సాగింది. ఈ సమావేశంలో ముంజేరు సర్పంచ్ పూడి నూకరాజు మాట్లాడుతూ పంచాయతీలో మురుగు కాలువ సమస్య సుమారు రెండున్నర ఏళ్లగా పరిష్కారం కావడం లేదని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ కాలువ సగం నిర్మించి ఉంది.. మిగతా సగం నిర్మించడానికి పంచాయతీ తీర్మానం చేయండని సూచించారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ తీర్మానం చేయడానికి ముందుగా పంచాయతీలో నిధులు ఉండాలి కదా.. ఇంటి పన్ను సుమారు రూ.24లక్షలు బకాయి ఉంది.. ఈ పన్ను చెల్లిస్తే కాలువ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేయొచ్చని సమాధానం ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందు కాలువ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేయిస్తే వెంటనే ఇంటి పన్ను చెల్లిస్తామన్నారు. దీనిపై కొంత సమయం ఎమ్మెల్యే, సర్పంచ్ మధ్య వాగ్వాదం జరిగింది. కాలువ నిర్మాణానికి తీర్మానం చేయండని ఎమ్మెల్యే సమావేశం కొనసాగించారు. అలాగే ఎరువులపై సభ్యులు ప్రశ్నించగా.. ఏవో హైమావతి మాట్లాడుతూ ఎరువుల కొరత కొంతవరకు ఉందని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే కలుగజేసుకుని మాట్లాడారు. భోగాపురం మండలంలో వ్యవసాయం తక్కువగా ఉండడంతో ఈ మండలానికి ఎరువుల తీసుకురావడంలో మూడవ ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఎరువులు చాలకపోతే డెంకాడ నుంచి తెప్పించి రైతులకు అందజేస్తామని చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించి సమస్యలను పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రి, తహసీల్దార్ రమణమ్మ, వైస్ ఎంపీపీలు దంతులూరి సూర్యనారాయణరాజు, పచ్చిపాల నాగలక్ష్మి, జిల్లా మత్స్యకార నాయకుడు బర్రి చిన్నప్పన్న, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగమాధవితో వాగ్వాదం చేస్తున్న సర్పంచ్ నూకరాజు

యూరియా పంపిణీపై విజిలెన్స్ విచారణకు సిఫారసు

● మెరకముడిదాం మండల సమావేశంలో సభ్యుల తీర్మానం

మెరకముడిదాం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది పంపిణీ చేసిన యూరియాపై విజిలెన్స్ అధికారులతో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శాఖలవారీగా అధికారులను పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ సక్రమంగా జరగలేదని సభ్యులు ఆరోపించారు. మెరకముడిదాం పంచాయతీకి వచ్చిన యూరియా గర్భాంలో ఒక ప్రజాప్రతినిధి ఇంటికి మళ్లించారని ఎంపీటీసీ బోనెల గోపి, నరసయ్యపేట సర్పంచ్ పెనుమజ్జి అప్పలనాయుడు ఆరోపించారు. దీంతో సభ్యులంతా ముక్తకంఠంతో యూరియా పంపిణీలో పారదర్శకత లేదని.. తమ ఇష్టానుసారంగా వ్యవసాయాధికారులు, పలువురు నేతలు కుమ్మక్కయి పంపిణీ చేశారని ఆరోపించారు. దీంతో జడ్పీ చైర్మన్.. సమావేశం నుంచే జేసీతో మాట్లాడి, యూరియా పంపిణీపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అలాగే విజిలెన్స్ విచారణకు సమావేశంలో తీర్మానించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల పంపిణీలో జాప్యం జరుగుతుందని పీవో నాగమణిని ప్రశ్నించారు. వీరు సమాధానంగా గుడ్లు, బాలామృతం ఒకే కాంట్రాక్టర్ వేయడంతో రెండు మూడు రోజులు జాప్యం జరుగుతుందని.. అలా జరగకుండా చూసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ సులోచనరాణికి పలు సూచనలు చేస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని సూచించారు. అలాగే ఉపాధి, విద్యుత్, పంచాయతీరాజ్, శాఖల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

తమటాడలో అగ్నిప్రమాదం

● రూ.4 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న పూరిల్లు

బొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తమటాడ గ్రామంలో ఆదివారం వేకువజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామస్థులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో కోండ్రు రమణమ్మకు చెందిన పూరింటి నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఈ మంటలు పక్కన ఉన్న పశువుల శాలకు వ్యాపించడంతో గ్రామస్థులు అప్రమత్తం అయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి, మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రమణమ్మ ఇంట్లో ఉన్న గ్యాస్ సిలెండరుకు మంటలు వ్యాపించడంతో ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో సిలెండర్ పేలి, మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒక పూరిల్లు, పశువుల శాల దగ్ధమైంది. సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకొని ఇళ్లు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతి

అనంతగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డముకు వ్యూపాయింట్ వద్ద యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కిశోర్ అనే వ్యక్తి స్కూటీపై అరకువెళ్లి, ఆదివారం తిరుగు ప్రయాణంలో డముకు వ్యూ పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి లోనై సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలువివరాలు తెలియాల్సి ఉంది. మృతుడు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందాల్సి ఉంది.

క్రీడల్లోనూ రాణించాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏబీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డా.ఎంఎస్ స్వరూప్ అన్నారు. ఆదివారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఉప్పల్‌లో జరిగిన 29వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటి, పతకాలు సాధించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌భరత్, సెట్విజ్ మేనేజరు రమణ, అక్కురావు, శివ, పల్సర్ బైక్ రమణ, శ్రీనివాస్, కోచ్ పెంకి అశ్విని, పాండ్రంకి సంతోష్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికిన వారిని శిక్షించాలి

బొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తన సాగులో సుమారు 30 ఏళ్లగా అనుభవంలో ఉన్న మామిడితోటను పైల నటరాజ్, ఆయన అనుచరులు ఇట్లా తిరుపతి, వెన్ను రామునాయుడు దౌర్జన్యంగా నరికేశారని చేకూరి సూర్యకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవుపల్లి రెవెన్యూ పరిధి కొండవానిపాలెం సమీపాన ఉన్న మామిడితోటను స్థానిక ఎస్ఐ యు.మహేష్ ఆదివారం పరిశీలించారు. రెవెన్యూ పరంగా పరిశీలన చేపట్టేందుకు తహసీల్దార్‌కు సిఫారసు చేస్తామని ఆయన చెప్పారు.

మద్యం సీసాల స్వాధీనం

బొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్‌సీ భాషా సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన బి.చిన్నప్పన్నను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. నిందితుడి నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయండి

విజయనగరం బాబామెట్ట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ఎస్ వరహాలుదొర డిమాండ్ చేశారు. ఆదివారం కణపాక యూత్ హాస్టల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఆదివాసీలకు ఏ కష్టం వచ్చినా ట్రైబుల్ రైట్స్ ఫోరం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు గిరిజనుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రమోద్, గిరిజా, ఆదినారాయణతో పాటు నూతనంగా ఎన్నికైన ఐఎన్ఎస్ దొర, ధనాజ య, ప్రసాద్‌రావు, రామారావు, నాగరాజు, పండు, రామారావు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీని కాపాడుకుందాం

కొత్తవలస, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ పాల డెయిరీని కాపాడుకోవలసిన బాధ్యత పాల ఉత్పత్తిదారులపైనే ఉందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు అన్నారు. విశాఖ డెయిరీ పరిరక్షణ కోసం ఈనెల 24 తేదీన గాజువాక, అక్కిరెడ్డిపాలెంలో ఉదయం 10 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి పాల ఉత్పత్తిదారులు అందరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు నిమ్మలపాలెం, బలిఘట్టాం, పాత సుంకరపాలెం, కొత్తసుంకరపాలెం, కొత్తూరు, సాంబయ్యపాలెం, నిడిగట్టు, గేదెలవానిపాలెం, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామాలలో ఉన్న పాల ఉత్పత్తిదారులను ఆదివారం కలిసి సమాచారం ఇచ్చారు. ఈసందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గుంతలో పడిన గేదె

శృంగవరపుకోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ లో నిర్మిస్తున్న ఓ బహుళ అంతస్తుల భవనం సమీపంలోని గుంతలో ఆదివారం ఓ పాడె గేదె పడింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి, గుంతలో ఉన్న గేదెను సురక్షితంగా బయటకు తీశారు. అగ్నిమాపక శాఖ అధికారి షేక్ మదీనా పాల్గొన్నారు.



గుంతలో నుంచి గేదెను బయటకు లాగుతున్న అగ్నిమాపక సిబ్బంది

లాకౌట్‌ను ఎత్తివేయండి



కర్మాగారం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు


కొత్తవలస, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం లాకౌట్‌ను ఎత్తివేయాలని టీఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘానికి చెందిన కార్మికులు డిమాండ్ చేశారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు లెంక శ్రీను ఆధ్వర్యంలో కర్మాగారంలో వారంతా ఆదివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా శ్రీను మాట్లాడుతూ లాకౌట్ విధించి ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ లాకౌట్ కాలానికి లేఆఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రతి కార్మికునికి రూ.40లక్షల చొప్పున చెల్లించి పూర్తి పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సలాది బీమయ్య, పిల్లా సీతారాం, దేముడుబాబు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎండీఎం జిల్లా అధ్యక్షుడు మురళీధరరావు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే నెల 5న జరిగే ఎండీఎం నిర్వాహకుల నాలుగో మహాసభలకు జిల్లాలోని ఎండీఎం నిర్వాహకులు జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు పిలుపునిచ్చారు. అమర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కరపత్రాలను విడు దల చేశారు. మెస్ చార్జీలు పెంచాలని, గౌరవ వేతనం రూ.8వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

ఉచిత బస్సు రయ్ రయ్

- జిల్లాలో నెల రోజుల్లో ప్రయాణించిన మహిళలు 17.91 లక్షలు



బస్సు ఎక్కుతున్న మహిళలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 'స్త్రీశక్తి' పేరుతో ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం పార్వతీపురం మన్యం జిల్లాలో సూపర్‌హిట్ అయ్యింది. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి ఈ నెల 15 వరకు జీరో టిక్కెట్‌పై 17,91,140 మంది మహిళలు వివిధ ప్రాంతాలకు ప్రయాణించారు. ఈ ప్రయాణాల వల్ల మహిళలకు రూ.6,20,42,309 ఆదా అయ్యింది. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 62 శాతం నుంచి ప్రస్తుతం 83 శాతానికి పెరిగింది. దీంతో జిల్లాకు కొత్త బస్సులు కావాలని ప్రతిపాదనలు పంపారు. ఈ పథకంలో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి ఆర్టీసీ సాలూరు డిపో నుంచి 57, పార్వతీపురం నుంచి 68, పాలకొండ డిపో నుంచి 60 బస్సులు నడుపుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 238 బస్సులు ఉన్నాయి. వాటిలో 185 ఈ పథకానికే కేటాయించారు. గత 30 రోజుల్లో సాలూరు డిపో నుంచి 5,12,647 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. పార్వతీపురం డిపో నుంచి 6,20,406 మంది, పాలకొండ డిపో నుంచి 6,58,085 మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని వారు అభినందిస్తున్నారు.

ఉపాధికి ఆసరాగా ఉంటోంది



నాది దత్తిరాజేరు మండలం గోభ్యాం. చెన్నైకు కార్మికులను తీసుకెళుతుంటాను. ప్రస్తుతం వారిని తీసుకెళ్లడానికి సాలూరు వచ్చాను. వివిధ గ్రామాలకు ఉచితంగానే ప్రయాణించవచ్చు. నా పని చూసుకోవచ్చు. ఉచిత ప్రయాణం వల్ల గతంలో కంటే మరిన్ని గ్రామాలకు ఎక్కువగా వెళ్లవచ్చు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ఈ పథకం ఉపాధికి ఊతమిచ్చే విధంగా ఉంది. మహిళలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-తలే పైడమ్మ, గొబ్యాం, విజయనగరం జిల్లా

ఆదరణ బాగుంది

స్త్రీశక్తి పథకం అమలు తరువాత ఆర్టీసీకి ఆదరణ పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో 62 నుంచి 83 శాతానికి పెరిగింది. ఈ పథకం అమలులో ఏమైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి సరిచేస్తాం. కొత్త బస్సులు కావాలని ప్రతిపాదించాం.

- వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజారవాణాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

అసౌకర్యం కలగకుండా సిరిమాను తరలింపు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి

గంట్యాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, భక్తులకు అసౌకర్యం కలగకుండా సిరిమాను తరలింపు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొండతామరాపల్లి గ్రామంలోని గుర్తించిన పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టుకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి మంత్రి పూజలు చేశారు. ఈనెల 24న సిరిమానును ఇక్కడ నుంచి విజయనగరం తరలించనున్న నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఆ రోజు ఇక్కడకి వచ్చే వారికి అన్నప్రసాదం పంపిణీ ఏర్పాట్లు చేయాలని స్థానికులకు సూచించారు. ప్రతి ఒక్కరికీ ప్రసాదం అందజేయాలన్నారు. ఈయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయకుమార్, టీడీపీ మండల నాయకులు రంధి చినరాము నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజల సహకారం మరువలేనిది

- గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాను ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం మరువలేనిదని గుంటూరు జిల్లాకు బదిలీ అయిన ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితంలో జిల్లాలో పనిచేసిన కాలం ఒక మధుర స్మృతిగా నిలుస్తుందన్నారు. ఎస్పీ భార్య, ఏపీఎస్పీ కమాండెంట్ మలికాగార్గ్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, పోలీసు అధికారులు సిబ్బంది, తమ పట్ల చూపిన అభిమానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ లీలారావుతో పాటు సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగ కానుక!

(ఐదో పేజీ తరువాయి)

తదితర వాటిపై పూర్తిగా జీఎస్టీ తొలగించారు.

- కారులు, బైక్‌లు 350 సీసీ లోపు వాటిపై 28 నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించారు. దీంతో వాటి ధరలు తగ్గనున్నాయి. దసరా, దీపావళి పండుగ రోజుల్లో వాహనాలు కొనుగోలు చేయడం కొందరు సెంటిమెంట్‌గా భావిస్తారు. ఈ నేపథ్యంలో సదరు కంపెనీలు బైక్‌లు, కార్లపై జీఎస్టీ తగ్గింపు ధరలతో పాటు డిస్కౌంట్లను సైతం ప్రకటించాయి. ఇప్పటికే కొంతమంది కొనుగోలుదారులు ప్రీబుకింగ్ కూడా చేసుకున్నారు.
- జీఎస్టీ సంస్కరణలతో ఇంటి నిర్మాణ వ్యయం కూడా భారీగా తగ్గనుంది. నిర్మాణ సామగ్రి ధరలు 4నుంచి 6 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది.
- ఈ- కామర్స్ సంస్థల్లో కూడా ఆఫర్ల సందడి మొదలైంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి.

పిల్లలపై ఓ కన్నేయండి

(ఐదో పేజీ తరువాయి)



ఆందోళన కలిగిస్తోంది. స్నేహితుల్లో ఎవరికో ఒకరికి గంజాయి, డ్రగ్స్, సిగరెట్ అలవాటు ఉంటే మిగతా వారు ఆకర్షితులవుతున్నారు. సరదాగా ఒకసారి అనే మాటగా మొదలై.. మత్తు అనే మాయలో పడేస్తోంది. అందుకే సెలవుల్లో పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి..

దసరా సెలవుల్లో పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారిపై ఒక కన్నేసి ఉంచాలి. బైక్‌లతో పాటు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడం మంచిదే. వారికి ఆడుకోవడానికి స్వేచ్ఛనివ్వడమే కాకుండా..వారిని కుటుంబసభ్యులు కనిపెట్టుకొని ఉండాలి.

-యు.మాణిక్యాలనాయుడు, డీఈవో, విజయనగరం

ఏనుగుల హల్‌చల్



పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో గత రెండు రోజులుగా గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు హడలిపోతున్నారు. ప్రధానంగా కుమ్మరిగుంట-కందివలస గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగులు అరటి, వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. ప్రస్తుతం అవి కోనవలస కొండపైకి చేరుకున్నాయి. దీంతో గ్రామ స్థులు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గజరాజుల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఫారెస్ట్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో రైతులు పంట పొలాలకు వెళ్లరాదని, గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న సున్నపుగెడ్డ జలపాతం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో ఆ ప్రాంతం కళకళలాడింది. జలపాతం అందాలను తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తారు. కొంతమంది అక్కడ స్నానాలు చేశారు. చిన్నారులు, మహిళలు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. మరోవైపు సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్, ఆడలి వ్యూపాయింట్ తదితర ప్రాంతాల్లోనూ సందర్శకులు సందడి చేశారు.



సున్నపుగెడ్డ జలపాతం వద్ద పర్యాటకులు ఇలా..

డోలు వాయిద్యంలో భాస్కర్‌కు కాంస్య పతకం



పతకంతో భాస్కరరావు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంతగైరమ్మపేట గ్రామానికి చెందిన ప్రముఖ డోలు విద్వాంసుడు తీడ భాస్కరరావు డోలు వాయిద్య పోటీల్లో కాంస్య పతకం సాధించారు. విజయవాడలో ఆదివారం వాగ్దేవి వాయిద్య సంగీత కళానృత్య సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఐదు వేల మంది పాల్గొన్న ఈ ప్రదర్శనలో భాస్కరరావు తన వాయిద్యంతో అందరి మెప్పు పొందారు. బహుమతి సాధించడంపై జిల్లా వాయిద్య కళాకారులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.